# అన్నప్రాశన

**సత్యవాద సోదరీమణులు**

విక్రమ్ విసుగ్గా మరోసారి రిస్ట్ వాచీ చూసుకున్నాడు.

'అబ్బ తనిక్కడ నిలబడి అప్పుడే రెండు గంటలు దాటిపోయిందా?'

బస్ స్టాప్‌లో జనాన్ని పరిశీలనగా మరోసారి చూశాడు. అందరి ముఖాల్లోనూ తామెక్కాల్సిన బస్సులు ఎంత తొందరగా వస్తాయా అన్న ఆత్రుత. అవే సంభాషణలు.

కనురెప్పపాటులో రివ్వున దూసుకొచ్చాయి రెండు బస్సులు. బిలబిలమంటూ ఎక్కేశారంతా. సుమారు బస్ స్టాపు ఖాళీ అయింది. దిగిన ప్రయాణికులు ఆటోలు, రిక్షాలు బేరమాడుకొని వెళ్లిపోయారు.

విక్రమ్ ప్రాణం ఉసూరుమంది. ఇక ఈ రోజింతే. రాత్రి పది గంటలు దాటిపోయింది. తనింటికి చాలా దూరంలో ఉన్నాడు. కాలి నడకన పోవాలి. ఎంత వేగంగా నడిచినా గంట పట్టేస్తుంది. వారిజ ఈ మధ్య తన మీద మరీ చిరాకు పడుతోంది. ముచ్చటపడి వారిజకి, బాబుకి తీసుకెళ్లిన ఏ వస్తువుల్నైనా నిర్లక్ష్యంగా చూస్తుంది. ఇలాంటి రోజులు అడపాదడపా వస్తుంటాయ్. కానీ తన సంపాదనేం తక్కువా? రెండు వేల రూపాయలు పెట్టి తొలిసంతానం మగబిడ్డ కదా అని ఉయ్యాల తొట్టి కొనుక్కెళ్లితే వారిజ ఎంత రాద్ధాంతం చేసింది. "మనకింత ఆడంబరాలవసరం లేదు. నా చీరతో ఉయ్యాల కడతాను. వీడి కోసం మీరు మరీ ఇదైపోతున్నారు. వేలకి వేలు సంపాదించి ఖరీదైన వస్తువులు తీసుకురమ్మని నేనెప్పుడైనా మీతో అన్నానా?" అంటూ...

తనేం ఊరుకున్నాడా? "నువ్వు అన్నావని కాదు. మన బాబు ముద్దుముచ్చట్లు తీర్చుకునే హక్కు నాకూ ఉంది. వీణ్ని ఏ లోటూ లేకుండా పెంచుతాను. ఇవ్వాళ ఉయ్యాలే కాదు,రేపు వీడికి ఒళ్లంతా బంగారు తొడుగు చేయిస్తాను. కాదు, కూడదు అనటానికి నువ్వెవరివి? వీడి కోసం నేనేమైనా చేస్తాను. నిన్నే కాదు, ఎవర్నీ లెక్క చేసేది లేదు" అనేశాడు.

వారిజ మాత్రం, తన పంతం తనది అన్నట్టు ఖరీదైన బొమ్మలు, రకరకాల డ్రెస్సులు, ఆఖరికి బిస్కెట్స్ బాబు కోసం తనేం తీసుకొచ్చినా వాడదు. బాబు ఏడిస్తే ఎగిరే పక్షుల్ని వచ్చిపోయే వాహనాల్ని, గుంపులుగుంపులుగా పరుగులు పెట్టే స్కూలు పిల్లల్ని ఇలా ఏవేవో చూపించి ఆడిస్తుంది. ఆవిడ చేత్తో కుట్టిన చొక్కాలాగూలు, ఓ నాలుగుంటాయ్. వాటినే మార్చిమార్చి వేస్తుంది. తను చేసే పని కిట్టక అర్ధాంగి ఈ మోస్తరు, తన మీద యుద్ధం ప్రకటిస్తోంది. తను చేస్తున్న ఈ పనితోనేగా మల్లికార్జున్ వాడి పెళ్లానికి కోరుకున్న నగలన్నీ చేయించాడు. శ్రీనివాస్ ఒకేసారి రెండు ప్లాట్లు కొన్నాడు. నర్వేష్ మాత్రం ఏం తక్కువ. దర్జాగా బ్రతికేస్తూ ఫుల్‌స్టాప్ పెట్టకుండా ముగ్గురు పిల్లలకి తండ్రయిపోయి అందరినీ మంచి కాన్వెంట్‌లో చదివించడం లేదూ? మిత్రత్రయాన్ని గుర్తు చేసుకున్నాడు. తన మనసు బలహీనపడ్డ సమయాల్లో అలానే చేస్తాడు విక్రమ్. హుటాహుటిన కొండంత బలం వచ్చేస్తుంది. వచ్చిన చిక్కల్లా, వాళ్ల భార్యల్లా వారిజ తనను సమర్థించదు. విక్రమ్ నిట్టూర్చాడు.

వీధి గుమ్మంలోనే బాబుని ఎత్తుకుని ఎదురైంది వారిజ. కొడుకుని, వారిజ చేతుల్లోంచి తీసుకోబోతుంటే వద్దన్నట్లు కళ్లతో వారించింది. "ఇప్పుడే నిద్ర పుచ్చాను. ఉయ్యాలలో పడుకోపెట్టేసి మీకు టిఫిన్ రెడీ చేస్తాను" అంది.

"అలాగే వారిజా, తొందరగా స్నానం చేసేస్తాను. ఇంతకీ టిఫినేం చేస్తున్నావ్?" భార్యతో ఏదో ఒకటి మాట్లాడదామని అన్నాడు. అప్పటికే వారిజ వంటగదిలోకి వెళ్లిపోయింది.

భార్య తీరుకి అతని మనసు చివుక్కుమంది. ఏదో సాకు చెప్పి బాబుని తన చేతికివ్వదు. తన బిడ్డ తనకేం కాకుండా పోతున్నాడా? వీడంటే తండ్రిగా తనకి పిచ్చి ప్రేమ. ఎత్తుకొని తనివితీరా ముద్దాడాలనీ, వాడి కేరింతలతో, బోసి నవ్వులతో తన్ను తాను మర్చిపోవాలనీ ఎంతో అనుకుంటాడు. వారిజ అవకాశం ఇస్తేనా? తన గాలే పసివాడికి సోకకూడదు అన్నట్లు ప్రవర్తిస్తుంది. చప్పున ఉయ్యాల దగ్గరకెళ్లాడు. పసివాడి బుగ్గలు పుణికి ముద్దాడేశాడు.

"వెర్రినాన్నా, నీకీ చీర ఉయ్యాలలో ఊగాల్సిన ఖర్మేంట్రా? కన్నా, నీ కోసం మీ అమ్మ నన్నేమీ చేయనివ్వదు. మీ అమ్మ మనసులో నా మీద కాస్త అనురాగం కల్గేట్లు చెయ్యరా! లోకం తెలియని పసివాళ్ల మాట దేవుడు వింటాడట. ఆ దేవునితోనే చెప్పు." నిశాంత్ నిద్రలోనే నవ్వుతున్నాడు. మరోసారి వాడి పసిబుగ్గలు ముద్దాడి, వారిజ వస్తున్న అలికిడి కావడంతో నెమ్మదిగా జారుకున్నాడు.

వంట గదిలో పీట వాల్చుకొని కూర్చున్నాడు. చట్నీ, సాంబార్ నంచుకుంటూ వేడి వేడి దోసెలు ఆవురావురంటూ తినేస్తున్నాడు. 'భోజ్యేషు మాతా' అన్నట్లు ఆ ఇల్లాలు మగని ఆకలెరిగి పెనం మీద దోసెలు వేస్తూనే ఉంది.

"నువ్వే వంట చేసినా పసందైన రుచిగా ఉంటాయ్.. నీ చేతిలో ఏం మహత్యం ఉందో మరి!" మెచ్చుకోలుగా చూస్తూ అన్నాడు విక్రమ్.

భర్త ప్రశంసలు గానీ, ప్రేమ కురిపించే చూపులు గానీ ఆమె మనసు దాకా వెళ్లవు. భర్త తెచ్చిన సరకులతో ఏ వంట చేస్తున్నా, విచిత్ర భావస్పందనలతో విలవిలలాడిపోతుంది ఆమె మనసు. అన్నం కుతకుత ఉడుకుతుంటే ఈ శబ్దం వెనుక ఎన్ని హృదయాలు ఆవేదనతో కుతకుతలాడాయో కదా అనుకుంటుంది. ఇలా దోసెలు, ఆమ్లెట్లు, పెసరట్లు ఏవి పెనం మీద వేసినా వీటి వెనకాల ఎన్నో గుండెలు ఉసూరన్న శబ్దం వినిపిస్తుంది. కాఫీ-టీలు, చివరకు బాబు కోసం పాలు కాచినా వాటిలో ఎందరు దుఃఖించి కార్చిన కన్నీళ్లున్నాయో కదా అని తలపోస్తుంది.

అందుకే తనకేవీ నోట్లో పెట్టుకోబుద్ధి కావు. నిత్యం పస్తులుండలేక ఏ కాస్తో తినక తప్పదు. నీతినిజాయితీలకు ప్రాణం ఇచ్చే తనకు. ఇలాంటి భర్త దొరికాడేమిటో? తల్లిదండ్రులెవరో తెలియక, నా అన్నవాళ్లు లేక, అనాథాశ్రమంలో పెరిగిన తను తోటి పిల్లలందరిలోనూ తెలివైనదనిపించుకుంది. ధర్మసూక్ష్మాలు, నీతి సూత్రా లు బాగా వొంట పట్టేవి. సత్ప్రవర్తన అలవరచుకోవాలని, నైతిక విలువలే ఊపిరిగా జీవించాలని, ఇతరుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి పెరుగుతున్న మనమంతా, బురదలో పుట్టిన బంగారు పుష్పాలం కావాలని, పసితనంలో తోటిపిల్లలకీ, పెద్దయ్యాక తన చుట్టూ చేరే చిన్నారులకీ చెప్తూ వచ్చింది.

అవటానికది బాలిక శరణాలయమే అయినా, వారిజ నడవడికకు అబ్బురపడ్డ ఆ శరణాలయవ్యవస్థాపకులు అక్కడే ఆమెను పంతులమ్మగా చేసేశారు. వారిజ కూడు, గూడు కోసం వెతుకులాడవలసిన అవస్థ తప్పించారు. పదోతరగతి పూర్తి కాగానే, ఏదో వృత్తి విద్య నేర్చుకొని పొట్ట చేత్తో పట్టుకొని వెళ్లిపోవలసిందే ఎవరైనా. అలాంటి వాళ్లంతా వారిజ అదృష్టానికి ఆనందపడేవారు. కించిత్తు అసూయ పడడం కూడా కద్దు.

తనని మరో అదృష్టం కూడా వెతుక్కుంటూ వచ్చింది. ఆశ్రమ వార్షికోత్సవసందర్భంగా ఆ రోజు పిల్లలతో చక్కని కార్యక్రమాలు రూపొందించింది తను. పిల్లల నాటికలూ, పాటలూ, వీణా వాదన,ఆ సభకు వచ్చిన వారిని ముగ్ధుల్ని చేశాయి. విరాళాల రూపంలో వేలకి వేలు పోగయ్యాయి.

వారిజ సంతోషం పట్టలేకపోయింది. "ఈ ఆశ్రమంలో పెరిగిన తులసి మొక్కవి తల్లీ. నీ చలువతో వీళ్లందర్నీ ఇలాగే తీర్చి దిద్దాలి. నాకా వార్ధక్యం పైబడుతోంది. ఇక ఈ బాధ్యతలన్నీ నీ కప్పగించి విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నాను" వారిజను దగ్గరకు తీసుకొని అన్నారు రాఘవరావుగారు.

"చాలా అన్యాయం సార్! వారిజ ఎప్పటికీ ఇక్కడే ఉండిపోతుందనుకుంటున్నారా? మనం వారిజను పెళ్లికూతుర్ని చేయబోతున్నాం. ఈ అందాలబొమ్మని అత్తవారింటికి పంపించేస్తున్నాం" వార్డెన్ రత్నాంబ రివ్వున దూసుకొచ్చి అంది.

ఆమె వెనకాలే విక్రమ్. మరుక్షణం వారిజ వొళ్లు జల్లుమంది. తీయని ఊహలేవో ఆమెను ఉక్కిరిబిక్కిరి చేయసాగాయ్.

విక్రమ్, తన వివరాలన్నీ రాఘవరావుగారి ముందుంచి, "మీ కభ్యంతరం లేకపోతే, మీ ఆశీర్వాదంతో వారిజను నా దాన్ని చేయండి" అన్నాడు.

రత్నాంబ—రాఘవరావు సొంత బిడ్డ కోసం ఆలోచించినట్టే, వారిజ వైవాహిక జీవితం, ఆమె భవిష్యత్తు ఎలా ఉంటాయో అని తర్కించుకున్నారు.

"అతని తల్లి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చివరి దశలో ఉంది. కోడలొచ్చి నట్టింట్లో దీపం పెట్టాలి. నేను పోయేలోగా నా కొడుకు కాపురం కళ్లారా చూడాలి అంటోంది. అంత వరకూ సబబే అలా అని అంతగా చదువబ్బని ఏ ఉద్యోగం లేని ఆ కుర్రాడికి తొందరపడి వారిజతో పెళ్లెలా జరిపిస్తాం రత్నాంబగారూ?" అని రాఘవరావంటే కొట్టి పారేసింది రత్నాంబ.

"కలిసొచ్చిన అదృష్టాన్ని కాలదన్నుకుంటే మనమే పశ్చాత్తాపపడవలసి వస్తుంది. లేనిపోని సందేహాలెందుకు? నాకైతే ఆ అబ్బాయి పెళ్లాన్ని పోషించుకోలేని అసమర్థుడిలా కనిపించడం లేదు. ఆ ఇంట్లో ఏ లోటూ ఉండదని నాకు గట్టిగా అనిపిస్తోంది" అని పట్టు పట్టింది. ఆ ప్రాంగణంలోనే, రాఘవరావుగారి చేతుల మీదుగానే తను విక్రమ్ ఇల్లాలైంది.



అత్తగారు, వారిజను ఎంతో ఆపేక్షగా చూసేది. "విక్కీ కోసం ఎంత బెంగ పడ్డానో తెలుసా తల్లీ? ముదిరిన ఈ వ్యాధి నన్నెంత కాలం బ్రతకనిస్తుంది? ఇంక వీడి బాధ్యతంతా నీదే. తల్లిగా లాలించి, ఇల్లాలుగా మురిపించి, ఏ పొరపొచ్చాలకీ తావివ్వకుండా కళ్లల్లో పెట్టుకొని చూసుకో!" అంటూ కన్నుమూసింది.

నెల తిరగకుండానే అమ్మలాంటి అత్తగార్ని కోల్పోవడంతో కుమి లికుమిలి ఏడ్చింది. క్షణక్షణం ఆవిడ మాటలే గుర్తొచ్చేవి. తల్లి లేని వెలితి భర్త మనసుని తాకనివ్వకూడదు-అనుకున్న వారిజ మరింత అనురాగాన్ని పంచిందతనికి.

అయితే భర్త వైఖరి అంతు పట్టేది కాదామెకు. అతనే పని చేసి ఇంత డబ్బు సంపాదిస్తున్నాడు. బయటకు వెళ్లటానికి ఒక టైమంటూ ఉండదు. ఒక్కోసారి ఊరు తెల్లారకుండా వెళ్లిపోతాడు. ఏ రోజూ అర్థరాత్రి దాటే దాకా రాడు. మరొకప్పుడు రోజుల తరబడి ఇంటినే అంటిపెట్టుకుని ఉంటాడు. వారం తిరిగేసరికి నాలుగైదు వేలైనా తెచ్చి తన చేతిలో పెడతాడు. ఒక్కోసారి నెలలు గడిచినా వందలు దాటదతని సంపాదన.

ఏం ఉద్యోగం చేస్తున్నట్లు? తల పగలగొట్టుకున్నా బోధ పడదు. ప్రేమగా అడిగినా "మీరేం చేస్తున్నదీ మీ భార్యగా తెలుసుకునే హక్కు నాకు లేదంటారా?" అని గదమాయించినా, మాట దాటేస్తాడు తప్ప, తన వృత్తివ్యాపారాలేంటో బయట పెడితేనా? తను పని చేసేది ఆఫీసుల్లోనూ కాదట, షాపుల్లో అసలే కాదట. గమ్మత్తుగా మాట్లాడి నవ్వులాటగా మార్చేస్తాడు.

భర్త ఛలోక్తులు విసురుతూ చమత్కారంగా మాట్లాడుతుంటే, ఆ విషయమే మరుగున పడిపోతుంది. తననింత మురిపంగా చూసుకునే భర్త దొరికాడు. అది చాలదూ? తనెందుకు లేనిపోనివి ఊహించుకోవటం. తను ఇంత సుఖసంతోషాలు అనుభవించగలనని కలలోనైనా అనుకుందా? భర్త ఏం చేస్తేనేం? అతడు తనకు దైవసమానుడు హాయిగా ప్రశాంతంగా కాలం కరిగిపోతోంది.

నిర్మలమైన ఆమె హృదయకాసారంలో ఒక రాయి పడనే పడింది. అంతే, జీవితమే అల్లకల్లోలమై పోయింది. ఆ రోజు భర్తకి తీయని కబురు చెప్పాలని అతని కిష్టమైన స్వీట్స్ తయారుచేసి ఎదురు చూసింది. విక్రమ్ ఒక్కడే రాలేదు. వెంట అతని మిత్రబృందం ఉన్నారు. తన ఆనందపు పొంగు మీద చన్నీళ్లు చల్లినట్లు అయింది. తమాయించుకొని ఆహ్వానించింది. చాటుగా భర్తని పిలిచి అతని చెవిలో శుభవార్త ఊది ం ది. భగవంతుడు నాకు రెండో వరం కూడా ఇచ్చేస్తున్నాడు. నీ రాకతో నా జీవితంలోకి వెలుగు ప్రవేశించింది. ఇక చంద్రుడు ఉదయిస్తే చల్లని వెన్నెల విరబూస్తుంది. "నాకింత అమూల్యమైన కానుక ఇస్తున్నావ్. ఈ భక్తుడు ఈ దేవతకు ఇప్పుడే ప్రేమ పూజ చెయ్యాలి" అంటూ దగ్గరికి తీసుకొని ముద్దులతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్న అతన్ని, "చాలు చాలు మీ అల్లరి! ఈ చిలిపితనం మా శ్రీవారిలో ఉరకలు వేస్తుందనే ఏకాంతంగా చెప్పాలనుకున్నాను మీరిందర్ని వెంటేసుకొచ్చారు!" అంటూ విదిలించుకుంది.

"సారీ డియర్! వాళ్లు మన పెళ్లైనప్పటి నుంచి, 'మీ ఆవిడ చేతి వంట రుచి చూపించూ' అంటూ వేపుకు తినేస్తుంటే ఇవ్వాళ తీసుకొచ్చేశాను" అంటూ నొచ్చుకున్నాడు.

విక్రమ్ చిన్నబుచ్చుకుంటే క్షణం చూడ లేదు వారిజ. "పోనీ లెండి స్వీట్స్ ఎలాగూ చేశాను. మీ ఫ్రెండ్స్‌కి ఇంకేం కావాలో చెప్పండి" అంటూ పనిలో పడింది.

రెండు కూరలూ, సాంబార్, బజ్జీ, పూరీ, అన్నింటితోనూ వాళ్లకి తృప్తిగా, తనివి తీరా భోజనం పెట్టింది.

"చెల్లెమ్మా చెల్లెమ్మా!" అంటూ ఎంతో ఆప్యాయత చూపించారు.

"నిజమే వీడన్నది. నీ వంటలు అదిరిపోయాయమ్మా! కడుపులెరువు తెచ్చుకొని మరీ తినేశాం. నీకేమైనా మిగిల్చామో లేదో!" తలోకరూ తలో మాట అన్నారు.

"దాందేముంది అన్నయ్యా? నాకు ఒంట్లో నలతగా ఉంది సరిగ్గా చేయలేక పోయాను. మరోసారి మీరంతా తప్పక రావాలి" తను అంటుండగానే,

"ఇంత కమ్మని భోజనం పెడతానంటే చెల్లెమ్మోయ్, నువ్వద్దన్నా వచ్చేస్తాం చూసుకో!" అన్నాడు మల్లికార్జున్.

నవ్వుల గలగలలలో గదంతా మారుమోగింది. ఒక్కసారిగా బాత్రూంలోకి పరిగెత్తింది వారిజ భళ్లున వాంతి చేసుకొని లోపలికి రాబోతూ కళ్లు తిరిగి పడిపోయింది. మిత్రులు కంగారు పడుతుంటే ఏం లేదురా! అంటూ విక్రమ్ వారిజను పొదివి పట్టుకొని లోపలి గదిలో మంచంమ్మీద పడుకోబెట్టాడు. "సారీ వారిజ ఇక నిన్ను శ్రమపెట్టను గోరువెచ్చని పాలు లాలనగా త్రాగించాడు. అదేం కాదండీ రాకరాక వీళ్లంతా వస్తే... ఛీ.. నాకు సిగ్గేస్తోంది అంది. నర్వేష్ చొరవగా వచ్చి మేం ఏం అనుకోంలే. నువ్వు విశ్రాంతి తీసుకో పండంటి బాబుతో మమ్మల్ని మావయ్యా అని పిలిపించాలి అంటూ విక్రమ్‌ని పక్కకి పిలిచి ఆ గది తలుపులు మూసేశాడు. "బ్రదర్ యూ ఆర్ లక్కీ నీకు అనుకూలవతియైన ఇల్లాలు దొరికింది" భుజం తట్టాడు శ్రీనివాస్. "ఏం లక్కీరా బాబు... మల్లిక్, నర్వేష్ భార్యల్లా మా ఆవిడపై అంటుందనుకున్నావా! నేనేం చేసి సంసారం నడుపుతున్నానో అని తెగ సందేహం తనకి." "తీర్చేయ్ మాంచి మూడ్ చూసుకొని వ్యవహారం ఆమె ముందుంచేయ్" విక్రమ్ మాట పూర్తికాకుండానే సలహా పారేశాడు శ్రీను.

# అన్నప్రాశన

సత్యవాద సోదరీమణులు

(గత సంచిక తరువాయి)

"బోడి సలహా చెప్పావ్‌లే. నా సొద వినవేం? జయ, పద్మజల్లా మనమేదారిన నడిచినా డబ్బు పడేస్తే చాలు అని అనుకోదు మా ఆవిడ."

"నిజమేరా శ్రీనూ! పాపం, వీడికి పెద్ద చిక్కే వచ్చిపడింది. తెలీకుండా జాగ్రత్త పడడమే మంచిది" అన్నాడు మల్లిక్.

"ఇప్పుడు వీడికొచ్చిన భయమేంలేదురా! మాటకారి, గడసరి. ఎంత కాలమైనా గుట్టు బయట పడనివ్వడు. పిల్లల్ని కనేశారో మొగుళ్లేం చేస్తున్నదీ పట్టదు. అవసరాలకి సరిపడా సంపాదించి పడేస్తే చాలు" అన్నాడు సర్వేష్.

"విక్కీ, అలా డీలా పడిపోయావేంట్రా? బెల్లం కొట్టిన రాయిలా ఉలకవు పలకవు!'

"ఏం చేయనురా శ్రీను, నా బుర్రంతా గందరగోళంగా ఉంది" విక్రమ్ తల పట్టుకున్నాడు.

"విక్కీ నేనొకటి చెప్తాను వింటావా! మీ వారిజ భావాలే పద్మజవి కూడా. ఇప్పుడే స్థితికొచ్చింది? అరవై నాలుగు కళల్లో చోరకళ కూడా ఒకటని కచ్చితంగా చెప్తుంది. ఈ టైములో బస్టాపుల్లో నిఘా వెయ్యండని, ఇంకో సమయాల్లో రైల్వే స్టేషన్లో పని జరుగుతుందని పెళ్లిళ్లలో అయితే నగలు పోయినా తొందరగా ఆడవాళ్లు చూసుకోరని నేనెప్పుడెప్పుడు ఎక్కడెక్కడికి వెళ్లాలో చెప్పి మరీ ఈ చోరకళలో మెళకువ లలవాటు చేసింది. నా సహధర్మచారిణి వల్లే నేను మీ అందరికీ నాయకుణ్ని అయ్యాను" మీసాలు మెలేశాడు మల్లిఖార్జున్.

"వీడన్నట్టు పెళ్లాన్ని చెప్పుచేతల్లో ఉంచుకోడం మన చేతుల్లోనే ఉంది. ఇలా పిరికి సన్నాసివైపోతావేం?" అన్నాడు సర్వేష్.

"ధైర్యేసాహసే లక్ష్మీ అని ఊరికే అన్నారా!" శ్రీను చటుక్కున ఏదో గుర్తొచ్చిన వాడిలా పెదవి కొరుక్కున్నాడు.

"నోర్లు ముయ్యండిరా! వీడసలే హడలిఛస్తుంటే మనం నోటి కొచ్చినట్లు వాగేస్తున్నాం. వీడి భార్య మన మాటలు వినేసిందో ఇప్పుడే వీడి పని గోవిందా!"

"ఒరేయ్ శ్రీనూ, బ్రహ్మచారివి నీకేం తెలుసురా నెల తప్పిన తొలి రోజుల్లో అలా మంచమ్మీద వాలేసరికి నీరసం ముంచుకొచ్చి నిద్ర కమ్మేస్తుంది. మా పద్మజ రెండు సార్లూ అంతే" బిగ్గరగా నవ్వాడు మల్లిక్.

మూసిన మరుక్షణమే గాలికి బెడ్ రూం తలుపు తెరుచుకుంది. నలతగా అన్న పుట్టబోయే పాపాయి గూర్చిన తీయని తలపుల్లో తేలిపోతున్న తన కళ్లు మూతలు పడితేనే వాళ్ల మాటల్లో బట్టబయలవుతున్న చేదునిజాలు చెవినపడి తన ఆనందమంతా ఆవిరైపోయింది. తనొక గజదొంగ భార్య అన్న కఠినసత్యం ఆవిడ భరించలేకపోయింది.

మిత్రులు జారిపోగానే భర్తని నిలేసింది. "మీ బండారం బయట పడదనీ, నన్ను జీవితాంతం ఇలాగే మభ్యపెట్టగలరనీ అనుకున్నారు కదూ! ఐతే ఇదన్నమాట. మీరు చేస్తున్న నిర్వాకం. పదిమందినీ బాధపెట్టి జేబులు కొట్టి అందిన చోటల్లా నగలు కత్తిరిస్తూ దోచుకుంటున్న సొమ్ముతోనా మనం బ్రతుకుతున్నది? మీదింత నీచమైన ప్రవృత్తి అనుకోలేదు."

భార్య అలా దులిపేస్తుంటే పరిస్థితులు ఎలా ఎదుర్కోవాలో అర్థం కాలేదు. శక్తినంతా కూడదీసుకొని తనూ వాదులాటకి దిగాడు. "నువ్వేం నీతిసూత్రాలు వల్లించక్కరలేదు. నేనూ ఉద్యోగం కోసం ప్రయత్నించకపోలేదు. ఏ చిన్న పని దొరికినా చేద్దామనే అనుకున్నాను. కాలం గడిచిందే తప్ప ఏదీ కలిసిరాలేదు. ఇదుగో వీళ్లంతా నా మిత్రులై వెన్ను తట్టి ప్రోత్సహించి ఈ దారికి తెచ్చారు. నాకీ దారి బాగా నచ్చింది. ఎంత రెక్కలు ముక్కలు చేసుకుంటే మాత్రం సంపాదించేది ఎంత కనక? ఏ నౌకరీ చేసినా వాళ్ల దగ్గరా వీళ్ల దగ్గరా చేతులు కట్టుకు నిలబడాలి. వంగీ లొంగీ బ్రతకాలి. యజమానిని అనిపించుకునేవాడి చేత తిట్లు, చివాట్లు తింటూ పొట్టపోసుకోవడం నాకు చేత కాదు."

భర్త వైఖరికి వొళ్లు మండింది వారిజకి. "మీరు తలెత్తుకు బ్రతికేస్తున్నారా? ఎల్లకాలం ఇలాగే సాగుతుందా? మీ నిజస్వరూపం బయటపడినప్పుడు మీరు చేయగలిగేదేమిటి?"

"చాల్లే జరిపిస్తున్నావ్ ఏం జరగదు. దేశం నిండా మాలాంటివాళ్లు కోట్లమంది ఉన్నారు. ఏ పదిమందో పట్టుపడ్డారని మేం పిరికివాళ్లం అయిపోం. మా తెలివితేటల మీద నమ్మకం ఉంది మాకు. నిజమే నీకు తెలియకూడదనుకున్నాను. దురదృష్టవశాత్తు తెలిసింది. నేనొక్కడ్నే ఏదో తప్పు చేస్తున్నట్టు సాధిస్తున్నావ్. ఒక్కటి చెప్పు ఎవరి పరిధిలో వాళ్లు ఏదో ఒక రకంగా అన్యాయం, మోసం చేయడం లేదంటావా? దోపిడీ లేనిదే రంగంలో, ప్రతి వాళ్లూ సాటి మనుషుల్ని ఏదో రూపంలో దోచుకోవడం లేదా!? ఆలోచించు" నచ్చచెప్పలేకపోయాడు.

వారిజ అదోలా నవ్వింది. "ఎంత నేర్పుగా మాట్లాడుతున్నారండీ? మీ హిప్నాటిజం నా మీదేం పని చేయదు. మీరు నీతినియమాలకు కట్టుబడి తీరాలి. మనసుంటే సన్మార్గం దొరికి తీరుతుంది. నేను కచ్చితంగా చెప్తున్నాను. మీరు ఈ చెయ్యివాటుతనానికి స్వస్తి చెప్పకపోతే మనం కలిసి బ్రతకడం అసంభవం!" ఆమె కంఠం రుద్ధమైంది. తన అభిప్రాయాన్ని సూటిగా చెప్పేసి దోసిట్లో ముఖం దాచుకొని లోపలికి వెళ్లిపోయింది.

ఓ నాలుగు రోజుల తరువాత కాస్త చీకటి పడేసరికి ఇంటికొచ్చాడు. వస్తూనే "వారిజా..!" అంటూ పిలిచి ఓ అయిదు వేలు ఆమె చేతిలో పెట్టాడు. ఓ క్షణం వారిజ ఆశ్చర్యపోయింది. భర్త పెందరాడే ఇంటికి రావడం, ఆనందంగా డబ్బు తన చేతికివ్వటం. తన తీరుకి అతను మారాడేమో ఏ మంచి ఉద్యోగమో సంపాదించి ఉంటాడు. "ఏదైనా పనిలో చేరారా?" ఆశగా అడిగింది.

విక్రమ్ ముఖం చిట్లించి "డబ్బు లోపల పెట్టు!" కటువుగా అన్నాడు.

"ఇక మీరీ వృత్తి వదులుకోనట్టేనా!"

"నీ కనవసరం! నేనేం చేస్తేనేం? నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను. మన బిడ్డని ఎవరూ పెంచలేనంత గొప్పగా పెంచుతాను. ఎప్పుడూ నన్ను విసిగించకు. నువ్వు సుఖపడు నన్ను స్తిమితంగా ఉండనీ!" భార్య చేతుల్లో పెట్టిన డబ్బు తనే తీసుకుని బీరువాలో పెట్టేస్తూ అన్నాడు.

ఇతగాడెప్పుడో నైతికవిలువలకి సమాధి కట్టేశాడు. ఈ దుర్మార్గునితో జీవితం పంచుకుంటే తనూ అంతే —

వారిజకి కాళ్ల కింద భూమి కంపించినట్టయింది. వారిజ ఓ నిర్ణయానికొచ్చింది అంతే ఈ సమస్య కదే పరిష్కారం. తనలా తెగించగలిగితే ఈ కొరగాని మనిషితో తనకే సంబంధం ఉండదు. అనుకున్నదో లేదో కడుపులో పసిబిడ్డ కదలిక. అమ్మో! తను మృత్యువు వాత పడితే పాపం చుట్టుకుంటుంది. తన మీద తనకి హక్కున్నా ఈ పసిప్రాణం తీసే హక్కు లేదు. తనువు మట్టిలో కలవాలనుకున్న తన నిర్ణయం క్షణంలో మట్టి కరిచింది. సంసారజీవితం,


బాబుని కని పెంచడం అన్నీ యాంత్రికంగా జరిగిపోతున్నాయి.

"వారిజా, ఒక్క విషయం ఈ వారంలో నిశాంత్‌కి అన్నప్రాశన చేసేద్దాం" టిఫిన్ ముగించి వక్కపొడి వేసుకుంటూ అన్నాడు.

"సరే. కనకదుర్గ గుడికి తీసుకెళ్లి ఆ ప్రసాదం తినిపించేద్దాం."

"ఆ మాట పొద్దున్నే నేను పూజారిగారితో అన్నాను. ఎల్లుండి మంచి రోజట" వంట గది తలుపువేస్తూ బదులిచ్చింది.

"ఏమిటి ప్రతి విషయంలో నన్ను దెబ్బ కొట్టాలని చూస్తున్నావ్. నా కొడుక్కి నేనేం కానా? వీడి అన్నప్రాశన ఘనంగా జరిపిస్తాను. నువ్వు అడ్డు చెప్పటానికి వీలు లేదు. వెండికంచంలో కమ్మని పాయసం తినిపించి అన్నప్రాశన చేస్తే తిండికి లోటు లేకుండా సుఖభోగి అవుతాడ్రా అనేది మా బామ్మ. వేలికి బంగారు ఉంగరం తొడిగి, వెండికంచంలో అన్నం తినిపించి నా స్నేహితులందరిని విందుకి పిలుస్తాను." తన మాట సాగి తీరాలన్నట్లు ఉంది విక్రమ్ ధోరణి. మారుమాటకి అవకాశం ఇవ్వకుండా వెళ్లి ముసుగు తన్ని పడుకున్నాడు.



ఉయ్యాల్లో బాబుని పక్కలో వేసుకుని తనూ పడుకుంది. అన్నెం పున్నెం ఎరుగని పసివాడు లేత చేతులతో తల్లిని పెనవేసుకున్నాడు. దగ్గరికి తీసుకుని ముద్దాడుతున్న వారిజకి దుఃఖం ముంచుకొచ్చింది. ఇవాళ అన్నప్రాశన అంటున్నాడు మరి కాస్త పెరిగాక అక్షరాభ్యాసం అంటాడు. ఈ పాపిష్టి సొమ్ముతోనే ఇలా ఒక్కోటీ ఆర్భాటంగా జరిపించి పెంచుతాడా? ఈ తండ్రి చేతిలో వీడి భవిష్యత్తేమిటి!? తండ్రి పోలికే వస్తే, అమ్మో! అలా జరుగకూడదు. ఇకపై నిశాంత్ ఈ వాతావరణంలో పెరగకూడదు. ఏదో ఒకటి చేసి తీరాలి. తను ఇలా నిర్లిప్తంగా ఉంటే అతనికి నిర్లక్ష్యం మరింత ఎక్కువవుతుంది. మెదడులో నరాలు చిట్లిపోయేలా ఆలోచించి మరో మార్గం అన్వేషించింది.

కాని అలా చేసేస్తే తను మాతృత్వపు మమకారానికి దూరమైపోతుంది. తన ఊహకి తనకే నవ్వొచ్చింది. నిజానికి ఏది సంతృప్తిగా అనుభవిస్తోంది కనుక? భర్త నడవడి తనని క్రుంగదీస్తూనే ఉంది. రేపేమిటని రెపరెప లాడుతున్న మనసుతోనేగా బిడ్డని పెంచుతున్నది. ఈ పసివాడు తనకేం కాదు-అని గుండె దిటవు చేసుకుంటే మంచే జరుగుతుంది. అత్తగారికిచ్చిన మాటకి కట్టుబడి భర్తతో తను కాపురం చేయాలి కాని, నిశాంత్ అతని బాబుగానే పెరగాలని ఎక్కడా లేదు. దృఢసంకల్పంతో తన ఆలోచన అమలు జరిపింది.

** ** **

ఈల వేసుకుంటూ ఉషారుగా ఇంటికి వచ్చిన విక్రమ్, "బాబు కనిపించటం లేదే!" అన్నాడు ఆత్రంగా.

"ఇక ఈ ఇంట్లో ఉండేది మనిద్దరమే."

విక్రమ్ షాక్ తిన్నాడు. "దౌర్భాగ్యురాలా ఏమిటి ఆ పేలాపన? ఇంతకీ నా బంగారు కొండని ఎలా మాయం చేశావు? ఏమిటి నీ నాటకాలు? నా బాబుని నాక్కాకుండా చేస్తే బ్రతకనిస్తాననుకుంటున్నావా?" భార్య జుట్టు పట్టుకుని తల గోడకేసి కొట్టాడు.

"మీ ఇష్టం ఏమైనా చెయ్యండి. ఒక దొంగ కొడుకుగా వాడు పెరగకూడదనుకున్నాను నేను. మీలో మార్పు కోసం ఇంత కాలం వేచి చూశాను. మీకి ఈ దొంగ బతుకు బాగుందని మొండికేస్తున్నారుగా, అందుకే మనకి తల్లిదండ్రులుగా ఉండే అర్హత లేదు. అత్తగారికి వాగ్దానం చేశాను కనుక, మీ పంచన పడి మీకు సేవలు చేస్తూ, నా జీవితం వెళ్లబుచ్చుతాను. నీతినియమాలు తప్పిన మనకెందుకండీ పిల్లలు? వాడు పెరుగుతున్న చోట మంచితనం, మానవత పుష్కలంగా వున్నాయండీ. నా ఆశయాలకు ప్రతిరూపంగా తీర్చిదిద్దుతారు రత్నాంబ గారు. ప్లీజ్, నన్ను వేధించకండి. మనకో బాబు పుట్టిన విషయం మర్చిపోండి." వారిజ వెక్కి వెక్కి ఏడుస్తోంది.

విక్రమ్ తల తిరిగిపోతోంది. అంటే బాబుని వారిజ తను పెరిగిన ఆశ్రమంలోనే ఇచ్చేసిందా? ఆ పైన ఆలోచించలేకపోతున్నాడు తనెప్పుడైనా పోలీసులకు పట్టుబడితే శరీరానికి తగులుతాయనుకున్న లాఠీ దెబ్బలు ఇప్పుడు మనస్సుకు తగులుతున్నాయి విక్రమ్ విలవిలలాడిపోయాడు.

ఎన్నో సార్లు అంతరాత్మ ఎదురు తిరిగినా దాన్ని అణిచి పెట్టిన అతను, తండ్రిగా బిడ్డను పెంచే అర్హత మీకు లేదు అని భార్య అనడంతో చలించిపోయాడు. అవునవును, పెద్దల్ని పిల్లలు అనుకరిస్తారు. తల్లిదండ్రుల ప్రభావం పిల్లల మీద పడి తీరుతుంది. తన ప్రాణానికి ప్రాణం బాబు, వాడిప్పుడు తనకి చేయి జారిన రత్నమయ్యాడు. ఒక్కసారి అతని రాతి గుండె కరిగింది. కళ్లల్లో నీళ్లు తిరిగాయి కొడుకు దూరమైపోవటం తనకే ఇంత బాధగా వుంటే, కన్నతల్లి వారిజ మనస్సు, కడుపుతీపిని కాదనుకుని ఎంత క్షోభ పడుతోందో చటుక్కున భార్యను దగ్గరకు తీసుకున్నాడు.

"నాలో కరుడు గట్టుకుపోయిన అమానుషత్వానికి సరైన శిక్ష వేశావు, కాని దౌర్జన్యం, దోపిడీ-వీటన్నింటికీ ఈ క్షణం నుంచే తిలోదకాలు ఇచ్చేస్తాను. బాబును కావాలని దూరం చేసుకుని నువ్విలా శోకమూర్తివి అయిపోతే నేను తట్టుకోలేను. బాబును విడిచి నేనూ బతకలేను. నువ్వన్నట్టు మరో బ్రతుకు తెరువు కోసం వెతుకులాడుతాను. ఈ సాయంత్రమే బాబును తెచ్చేసుకుందాం" అంటూ బయటికి వెళ్లిపోయాడు.

భర్తలోని మార్పు వారిజకి రవ్వంత ఊరటనిచ్చింది. ఇప్పటి ఇతని మనఃస్థితి క్షణికమైంది కాకపోతే చాలు భగవంతుడా అనుకుంది—అన్నట్టే ఆ సాయంత్రం విక్రమ్ చాలా హడావుడి చేశాడు.

"వారిజా. ఈ రిక్షాకి పసుపు బొట్లు పెట్టు" అంటూ కొత్త సైకిల్ రిక్షా గుమ్మం ముందు పెట్టాడు.

ఆశ్చర్యంగా చూస్తున్న భార్యతో, "నమ్మలేకపోతున్నావా? నిజం వారిజా. ఈ విక్రమ్ ఇంక రెక్కల కష్టంతోనే జీవిస్తాడు. కండలు కరిగించి సంపాదించిన దానితో ఆలుబిడ్డల్ని పోషించుకుంటాడు. త్వరగా రిక్షా ఎక్కు. చీకటి పడకుండా రత్నాంబగారి ఇంటికి వెళదాం. బాలచంద్రుని నవ్వు వెన్నెల లేకుండా ఏ రాత్రీ గడపకూడదు. అమావాస్య లాంటి నా చీకటి జీవితాన్ని అంతం చేసి పున్నమివెన్నెల కురిపించావుగా!" ఆనందంతో భార్య చేయి పట్టుకుని బయటికి నడిచాడు.

హుషారుగా రిక్షా తొక్కుతున్నాడు విక్రమ్. చల్లనిగాలి వారిజ నిలువెల్లా గిలిగింతలు పెడుతోంది. ఈ అనుభూతి ఎప్పటికీ శాశ్వతం కావాలి. కష్టార్జితంతో గంజి మెతుకులు తినిపించినా అదే అసలైన అన్నప్రాశన. తండ్రిగా ఇప్పుడు తన భర్త ఆ అర్హత సంపాదించుకున్నాడు సంతృప్తిగా అనుకుంది వారిజ.

(అయిపోయింది)